# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 14-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్ లను నియమించారు.

❖ భారతదేశం చైనాతో సానుకూల సంబంధాలను కొనసాగించాలని కోరుకుంటోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.

❖ గ్రామాల అభివృద్ధితోనే వికసిత్ భారత్ 2047 దార్శనికత సాకారమవుతుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

❖ భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా బృందం ఐ.ఎస్.ఎస్. నుండి భూమిపైకి ఈరోజు సాయంత్రం తిరుగు పయనమయ్యింది.

=========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్ లను నియమించారు. హర్యానా గవర్నర్ గా ప్రొఫెసర్ అశిమ్ కుమార్ ఘోష్ ను, గోవా గవర్నర్ గా పూసపాటి అశోక్ గజపతి రాజు, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవిందర్ గుప్తా ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. లడఖ్ పూర్వపు లెఫ్టినెంట్ గవర్నర్, రిటైర్డ్ బ్రిగేడియర్ డాక్టర్ బి. డి. మిశ్రా రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు.

=========================

సంక్లిష్ట అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో భారతదేశం చైనాతో సానుకూల సంబంధాలను కొనసాగించాలని కోరుకుంటోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. రెండు రోజుల చైనా పర్యటనలో భాగంగా జైశంకర్ ఈరోజు బీజింగ్‌లో ఆ దేశ ఉపాధ్యక్షులు హాన్ జెంగ్‌తో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను నిరంతరం కొనసాగించడం వల్ల పరస్పరం ప్రయోజనకరమైన ఫలితాలు లభిస్తాయని అన్నారు. షాంఘై సహకార సంస్థ (SCO)లో చైనా అధ్యక్ష పదవికి భారతదేశం మద్దతు ఇస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా రేపు టియాంజిన్ నగరంలో జరిగనున్న SCO విదేశాంగ మంత్రుల సమావేశంలో జైశంకర్ పాల్గొనున్నారు.

==========================

గ్రామాల అభివృద్ధితోనే వికసిత్ భారత్ 2047 దార్శనికత సాకారమవుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పనితీరు సమీక్ష కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి కుటుంబానికి ప్రాథమిక సౌకర్యాలు, నాణ్యమైన రహదారులు, మహిళా సాధికారత, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు అందరికీ పక్కా ఇల్లు ఉండాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిలో పురోగతిని సాధిస్తోందన్నారు. 2029 నాటికి రెండు కోట్ల అదనపు ఇళ్ళు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పెమ్మసాని చంద్రశేఖర్ వివరిస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

==========================

ఆక్సియం-4 మిషన్ కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ISS కి వెళ్ళిన భారత వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా బృందం భూమిపైకి ఈరోజు తిరుగు పయనమయ్యింది. ఈ బృందం రేపు మధ్యాహ్నం 3 గంటలకు భూమికి చేరుకోనుంది. ఆ తర్వాత గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా, ఇతర సిబ్బందితో కలిసి, భూమి గురుత్వాకర్షణ శక్తికి అనుగుణంగా ఫ్లైట్ సర్జన్ల పర్యవేక్షణలో 7 రోజుల పునరావాస కార్యక్రమంలో పాల్గొంటారు. కాగా శుభాన్షు శుక్లా ISSకి 14 రోజుల మిషన్ కోసం వెళ్లారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన రెండవ భారతీయ వ్యోమగామిగా ఆయన నిలిచాడు.

==========================

కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలరవాణా శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ బింస్టెక్ పోర్ట్స్ కాన్క్లేవ్ 2025ను ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ప్రారంభించారు. రెండు రోజుల పాటూ జరగనున్న ఈ సదస్సుకి 26 సభ్య దేశాల నుండి వివిధ ఓడరేవుల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారని ఆయన వెల్లడించారు. 100కి పైగా వాణిజ్య సంస్థల ప్రతినిధులు కూడా ఇందులో పాల్గొన్నారని కేంద్రమంత్రి పాత్రికేయుల సమావేశంలో తెలియజేశారు. మొదటి రోజు, ఈ సమావేశంలో సాంకేతిక అంశాలు, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి చర్చించామని తెలిపారు. ఈ విషయంలో సభ్య దేశాల ప్రతినిధులు ఈ సందర్భంగా అనేక సూచనలు, ప్రతిపాదనలు చేశారని ఆయన వెల్లడించారు. తరువాత, సముద్ర రవాణా ఒప్పందంపై సభ్య దేశాల ప్రతినిధులు  సంతకం చేశారని తెలియజేశారు. ఈ కాన్క్లేవ్ లో సముద్రయాన వాణిజ్యంలో నూతన అవకాశాలను అన్వేషిస్తున్నామని సర్బానంద సోనోవాల్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

==========================

భారత చలన చిత్ర నటి బి.సరోజా దేవి మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భారతీయ సినిమా, సంస్కృతికి ఆదర్శంగా నిలిచిపోతారని అన్నారు. కాగా సరోజా దేవి 1955 నుంచి  తెలుగు, కన్నడ, తమిళ చిత్రాల్లో నటించి వైవిధ్యభరితమైన నటనా ప్రదర్శనలతో తరతరాలుగా చెరగని తనదైన ముద్ర వేశారు. భూకైలాస్, పాండురంగ మహత్యం, సీతారామ కళ్యాణం, జగదేకవీరుని కథ, శకుంతల, దానవీర శూర కర్ణ, ఆత్మబలం లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించారు.

==========================

మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల పట్ల యువతకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 18న వారణాసిలో మూడు రోజుల పాటూ యువజన ఆధ్యాత్మిక సదస్సు, నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్‌ను నిర్వహిస్తున్నామని  కేంద్ర యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... దేశవ్యాప్తంగా వంద ఆధ్యాత్మిక సంస్థల నుండి దాదాపు 500 మంది యువ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశం ముగింపులో, మాదకద్రవ్య వ్యసనాన్ని ఎదుర్కోవడానికి కార్యాచరణ ప్రణాళిక అయిన కాశీ డిక్లరేషన్‌పై సంతకం చేయనున్నామని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

=========================

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయం సాధించిన చంద్రయాన్-3 నేటితో రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ మిషన్ యొక్క ప్రాథమిక లక్ష్యం చంద్రుని దక్షిణ ధ్రువానికి సమీపంలో ఉన్న ఎత్తైన ప్రాంతాలలో ల్యాండర్, రోవర్ లను ను ఉంచడంతో పాటూ ఎండ్-టు-ఎండ్ ల్యాండింగ్, రోవింగ్ సామర్థ్యాలను ప్రదర్శించడం. 2023లో ఇదే రోజున, ఇస్రో అభివృద్ధి చేసిన LVM 3 M4 రాకెట్ చంద్రయాన్-3ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

=========================

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమం శాఖ మంత్రి జె.పి. నడ్డా తన మూడు రోజుల సౌదీ అరేబియా పర్యటనను ముగించుకొని ఈరోజు భారత్ కు చేరుకున్నారు. ఈ పర్యటనలో ఎరువుల సరఫరా గొలుసును గణనీయంగా పెంచే దిశగా కీలకమైన ఒప్పందాలను కుదుర్చుకున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

=========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,500 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. చివరికి 247 పాయింట్ల నష్టంతో 82,253 వద్ద ముగిసింది. నిఫ్టీ 67.55 పాయింట్ల నష్టంతో 25,082 పాయింట్ల వద్ద స్థిరపడింది.

=========================

రాజస్థాన్, ఒడిసా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో రానున్న 4 రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. మరిన్ని వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త వెల్లడిస్తూ...

(వాయిస్ 14 సెకన్లు)

=========================
=========================